

# 'నేను నీదాననే...'

– అమృత

ఉదయం పది గంటలు కావస్తోంది! రోహిణీ కార్తె ఎండ నిప్పులు చెరుగుతోంది!

వసంతా పూర్తి చేసుకుని, బియ్యం చేటతోనహావచ్చి వీధి గుమ్మంలో కూర్చుని, చెయ్యి బియ్యంలోనూ, దృష్టి రోడ్డుమీదా నిలిపింది తులసమ్మ! మనసు, నాలుగు వీధుల కవతలవున్న ఆడపడుచు యింటికి వెళ్లిన భర్త దగ్గరకి పరిగెత్తింది!

ఆలోచనల్లో మునిగిపోయిన తులసమ్మ ఉన్నట్టుండీ, "అమ్మా" అన్న పిలుపు వినిపించి, ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది!

లోపలి గుమ్మంలోంచి నెమ్మదిగా వస్తోంది, జ్యోతి!

కూతుర్ని చూడగానే తులసమ్మ మనసులో బాధ రెట్టింపు అయింది.

వసిమి పచ్చనిముఖం, విజ్ఞానమూ ఆత్మవిశ్వాసమూ కలబోసుకుని, మంచితనపు మెరుగు పెట్టుకుని మెరిసేకళ్లు, సన్నని ముక్కు, తీరైన శరీరం-యింక చూడలేక తలతిప్పుకుంది తులసమ్మ.

"ఏమిటమ్మా, యిక్కడ కూర్చున్నావు, వేడిగాలి వస్తుంటే?!" తల్లి దగ్గరగావస్తూ, మందలింపుగా అంది జ్యోతి.

"ఫర్వాలేదమ్మా, లోపలే కూర్చున్నానుగదా?!" వీధివైపు చూస్తూ అంది తులసమ్మ.

వడగాలికి కందిపోయిన తల్లిముఖం చూస్తూంటే, మండుటెండలో నడిచి రాబోయే తండ్రి ముఖం యింకెంత వడిలిపోయి వుంటుందో ననిపించింది, జ్యోతికి.

"నాన్న లోపలికి రాకుండా ఎక్కడికీ పారిపోరుగాని, నువ్వు ముందు లోపలికి పద!" బలవంతంగా తల్లి రెక్క పట్టుకుని లేవదీసింది.

తప్పనిసరిగాలేచి, ఆఖరిసారిగా వీధివైపు చూసిన తులసమ్మ ముఖం ఒక్కసారిగా దీప్తి వంతమైంది!

"అదిగో, నాన్నగారొస్తున్నారు..."అంటూ గబగబా గేటుదాకా ఎదురువెళ్లింది.

జ్యోతి తల్లీ వెనక వెళ్లలేదు! మౌనంగా బియ్యం చేట తీసుకుని యింట్లోకి వెళ్లిపోయింది.

మనసులో కోటి ప్రశ్నలు నెమరువేసుకుంటూ గేటు తీసిన తులసమ్మకి, చేరువైన భర్త ముఖం చూడగానే నోటమాటరాలేదు!

రోహిణీకార్తె సూర్యుడిదాకా వెళ్లివచ్చినట్టుంది, వెంకట్రామయ్య ముఖం. ఆతృతగా ఎదురు వచ్చిన భార్య వైపు చూసే ఓపికకూడా లేనట్టు, నిశ్శబ్దంగావెళ్లి పడక్కుర్చీలో జేరబడి కళ్లు మూసుకున్నాడు!

ఒక్కక్షణం ఏం చెయ్యటానికీ పాలుపోలేదు, తులసమ్మకి. చివరికి ఒంటిమీద తెలివి వచ్చినదానిలా, భర్తకి దాహం యివ్వాలని స్ఫురించి, చప్పున లోపలికి వెళ్లబోయింది! ఆమె నాలుగడుగులు వేసేసరికి గుమ్మంలోనే మజ్జిగ తేటవున్న గ్లాసుతో ఎదురైంది జ్యోతి!

కూతురివైపు సొంతం తలెత్తి చూడటానికే భయపడినట్టుగా, తల వంచుకునే జ్యోతి చేతిలో గ్లాసు అందుకుని భర్త దగ్గరకి వచ్చింది.

"ఇదిగో, యీ మజ్జిగతేట కాస్త తాగండి! ప్రాణం కుదుట పడుతుంది!" అన్న భార్య మాటలతో, ఈ లోకంలోకి వచ్చినవాడిలా కళ్లు తెరచి చూశాడు వెంకట్రామయ్య! నిశ్శబ్దంగా గ్లాసు అందుకునిమజిగ తాగి, మళ్లీ వెనక్కి వాలాడు!

ఈ సారి తులసమ్మ వెనక్కి వెళ్లలేదు! గ్లాసు కిందపెట్టి కుర్చీ పక్కనే చతికిలబడి, భర్తవైపు చూసింది!

భార్య ముఖంలో వెయ్యి ప్రశ్నలు అడగాలన్నంత ఆతృత, పెదవి విప్పలేని నిస్సహాయత చూసి ఒక్కసారిగా ఆమెమీద అంతులేని జాలి కలిగింది వెంకట్రామయ్యకి వయసు మాట మర్చిపోయి, ఆమెని ఒక్కసారి గుండెలకు హత్తుకుని ఓదార్చాలని పించింది! "పిల్లలు కలగలేదని నువ్వు బాధపడిన నాడుకూడా నిన్ను ఓదార్చాలని అనిపించలేదు తులసీ! కాని, డబ్బు సంపాదించలేని భర్త, అవిటిదైన కూతురు, యీ యిద్దరితోనూ అల్లుకుపోయిన నీ జీవితాన్ని చూస్తుంటే భగవంతుడు నిన్ను నాకెందుకు కట్టబెట్టాడా అనిపిస్తోంది!" అనుకున్నాడు.

మౌనంగా తనవైపే తదేకంగా చూస్తున్న భర్తని చూసే సరికి తులసమ్మకి మరింత కంగారూ, ఆతృతా కలిగాయి! "ఏమైందండీ?! ఏమంది కాంతమ్మొదిన?" అంది.

వెకట్రామయ్య నవ్వాడు! "ఏమంటుంది తులసీ?! నన్ను డబ్బు సంపాదించలేని చవట అంది! నా కూతుర్ని కుంటిదంది! నువ్వు ఆడబడుచుకి సాయంచేసినట్టేచేసి, లక్షణమైన తన కొడుక్కి కుంటి కూతుర్ని కట్టబెట్టాలని చూస్తున్నావంది! నీకూ నాకూ తనమీద నిజమైన ప్రేమాభిమానాలేవుంటే, మన కుంటి పిల్లని తన కొడుక్కి కట్టబెట్టి వాడి జీవితం నాశనం చెయ్యాలని ఒక్కనాటికీ అనుకోమంది. ఇంకా ఏమందో చెప్పే ఓపిక నాకులేదు తులసీ! కాని ఒక్క విషయం మాత్రం ఖచ్చితంగా చెబుతున్నాను! ఇంక మనపిల్ల కేశవభార్య కావటమనేది కల్లోమాట! దానికి వేరే సంబంధం చూసి చేద్దాం! దాని అదృష్టం ఎలావుందో..అది ఎవరికి భార్య కావాలని రాసిపెట్టి వుందో.." వెంకట్రామయ్య గొంతు వణికింది.

ఈసారి తులసమ్మకి నోటిమాటేకాదు, చలన వలనాలు కూడా ఆగిపోయాయి! కళ్లముందు, తాగుబోతూ తిరుగుబోతూ అయిన భర్తతో నరకం అనుభవిస్తూ, "అన్నయ్యా! నువ్వూ వదినా లేకపోతే నేనూ నా కొడుకూ ఎప్పుడో చచ్చిపోయివుండేవాళ్లం! మా చర్మం వలిచి మీకు చెప్పులు కుట్టినా మా రుణం తీరదన్నయ్యా!" అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ నెలకి సరిపడ సరుకులూ, బట్టలూ సమస్తం తమనించి పుచ్చుకుంటున్న ఆడబడుచు కాంతం కదిలింది. ఇంజనీరుగా సెలక్టయి, ఉద్యోగానికి వెళ్లబోతూ, మేనమామ కాళ్లకి నమస్కరించి మామయ్యా! చిన్నప్పట్నించి తిండిపెట్టి, వందలకి వందలు ఫీజులుకట్టి చదివించీ నాకు జీవితాన్నిచ్చావు! నాకు తండ్రివైనా, మామయ్యవైనా నువ్వే" అంటున్న మేనల్లుడు కేశవ కనిపించాడు.

భర్త సంపాదన తక్కువేఐనా, అందులోంచే ఆడ

బడుచుకి సమస్తమూ జరిపించటానికి ఏనాడూ తాను అయిష్టం చూపించలేదు. సరికదా, సాటి ఆడదానిగా ఆమెని చూసి జాలిపడి, మరింత చేసింది, పెట్టింది! వీటన్నింటికి ప్రతిఫలం యిదా? తులసమ్మకింకా ఎందుకో పూర్తిగా ఆశ చావలేదు! ఆడబడుచు సంగతి సరే, తనకి మొదటినించీ ఏ మూలో అనుమానం మెదలుతూనే వుంది! కాని, కేశవ, బంగారంలాంటి కుర్రాడు. ముఖ్యంగా జ్యోతి అంటే ప్రాణంపెట్టే మనిషి-అతడి అభిప్రాయంతో పనిలేదా? లేక, అతడి అభిప్రాయంకూడా అదేనా?

మనసులోమాట బైటికి వెళ్ల గక్కింది తులసమ్మ.

లోపల్నించి తల్లిదండ్రుల సంభాషణ అంతా వింటున్నజ్యోతికి, తల్లి ఆప్రశ్న అడగగానే, తాను అడగలేక సతమతమవుతున్న బాధ కాస్త తగ్గింది! నిజమే, అత్తయ్యకి తనంటే మొదటినుంచీ కాస్త చులకన భావమే. ఏదో తన అవసరంకొద్దీ తనమీద ప్రేమ ఒలకబోసిందిగాని, ఆప్రేమ నాలికచివరి భాగాన నాట్యంచేసే స్వార్థపు ముసుగని తనకి చాలాసార్లు అనిపించింది! తల్లిదండ్రులతో ఆమాటే అందికూడా! కానీ కేశవ? కేశవ అలా కాదే?! తను కుంటిదన్న ఏహ్యభావం అతడిలో ఏమూలా లేదు! అతడి చూపుల్లో, మాటల్లో, స్పర్శలో, తాను అతడి సొత్తు అన్న భావమే కాని దూరం ఏనాడూ లేదు! అతడు కూడా ఉద్యోగం రాగానే మారిపోయాడా?! అత్తయ్య అతణ్ణికూడా జయించగలదా?

బైటనించి తండ్రి సమాధానం వినిపించింది. "నిజమే! నేనూ నీలాగే కేశవ మీదే ఆశపెట్టుకున్నాను! కానీ కాంతం ఏమందో తెలుసా? "నాకొడుక్కి మాయ మాటలుచెప్పి నీ అల్లుణ్ణి చేసుకోవాలని చూస్తున్నావేమో?! వాడు ఒప్పుకుంటే ఒప్పుకోవచ్చుగాక, కాని, నేను మాత్రం మరి వాడి గడప తొక్కేదిలేదు! నాకున్న ఒక్కగానొక్క బిడ్డనీ నానుంచి విడదీసి నీ కూతుర్ని సుఖపెట్టదల్చుకుంటే అలాగే కానీ!" అంది! ఆ మాటలు విన్నాక నాకు ఆశ పూర్తిగా చచ్చిపోయింది! కేశవ ఎంత మంచి వాడైనా కావచ్చు! కానీ, దాని అంగీకారం లేనిదే వాడు చేసుకుంటానన్నా నా పిల్లని యివ్వను! దాన్ని ఒప్పించమని వాణ్ణి ప్రాధేయపడనూ పడను! అందుకే యిక ఆశలేదని చెబుతున్నాను! వివాహాలు దైవ నిర్ణయాలని పెద్దలు వూరికే చెప్పారా? కానీ, ఏది ఎలా రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది....."

తండ్రి సమాధానం విన్న జ్యోతికి క్షణకాలం శరీరమూ మనసూ మొద్దు బారిపోయాయి! "మరేం ఫర్వాలేదు, బాధపడకు! ఎవరున్నా లేకపోయినా నేను నిన్ను ఓదారుస్తాను!" అంటూ ఆమె, కంటినుంచి ఒక వెచ్చని కన్నీటి బొట్టు మృదువుగా ఆమెను హత్తుకుంది.

* * *

కేశవా!

బాగున్నావా! నేను గుర్తున్నానా? ఈ ప్రశ్న వింతగా అనిపిస్తోందా నీకు? నిజమే, నాకూ అలాగే వుంది! నీ వూపిరిలో వూపిరినై పోయానని అనుకున్నానేకాని, "నేను గుర్తున్నానా" అంటూ నిన్ను ప్రశ్నించే క్షణం వస్తుందనుకోలేదు. కాని, అసంభవాలని మనం గట్టిగా అనుకున్నవన్నీ యిట్టే, కన్నుమూసి తెరిచినంత తేలిగ్గా, జరిగిపోతాయని పాఠం చెబుతోంది కాలం! కాలం నాకోసం అందమైన ప్రత్యూషల్నీ వెచ్చని రాత్రుల్నీ తెస్తుందని అనుకున్నానే కానీ నాకు గురువై జీవిత పాఠాల్నినేర్పుతుందని అనుకోలేదు! యిప్పటిదాకా నాకు గురువైనా స్నేహితుడివైనా, బంధువువైనా నువ్వే! నీహితవచనాలు విన్నాను. నీతో కలిసి సుఖదుఃఖాలననుభవించాను! నేను నీదాన్నని గర్వించాను! నువ్వెన్నటికీ నావాడివేనని అహంకరించాను! కాని, మనిద్దరికీ మధ్య విధి అనేది ఒకటి వుందని, భగవంతుడనే వాడొకడు వున్నాడని పూర్తిగా విస్మరించాను! నాకీ పోలియో కాలు యిచ్చినందుకు నేనెప్పుడూ భగవంతుణ్ణి నిందించలేదు! నాకు నీలాంటి ఆత్మీయుణ్ణి యిచ్చినందుకు నమో వాకాలు అర్పించాను! కాని, యిప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైనట్టు కన్పిస్తోంది!

నేను రాస్తున్నదంతా వింతగా నీకు కోపం తెప్పించేలా, బాధపడేలా వుందా కేశవా?! నిజమే! నాకూ అలాగే వుంది! నామీద నేను కోపం తెచ్చుకుంటూనే నాలోనేను బాధ పడుతూనే యిదంతా రాస్తున్నాను! అలాగే నువ్వూ చదువు! నువ్వెప్పుడూ తమాషాగా అంటూండే వాడివి చూశావా, సృష్టిలో అన్న చెల్లెళ్లు, తమ్ముళ్లు మామయ్యలు అంటూ రకరకాల బాంధవ్యాలు ఏ తంతూ లేకుండానే సహజంగా ఎలా ఏర్పడతాయో, అలాగే భార్యా భర్తల బాంధవ్యాన్ని కూడా భగవంతుడు సృష్టిస్తే బాగుండునని?! కాని మనం ఆ మాటలు అనుకునేటప్పుడు మనకి తెలియలేదుగాని, కేశవా, భార్యా భర్తల్నికూడా భగవంతుడు కూర్చే వుంచుతాడు! అయితే మనకి ఆ విషయం తెలియటానికే చాలా తతంగం నడుస్తుంది! అంతే!

నేనింత వేదాంతం రాస్తున్నానేమిటా అని ఆశ్చర్యపోతున్నావా? జీవితంమీద అన్ని ఆశలూ చచ్చిపోయాక మిగిలేది అదే కదా?! నువ్వు నా వాడివని గర్వించినంత కాలమూ, విహంగంలా గగన వీధుల్లో తేలిపోయాను! కాని, విధి నన్ను దూరంగా పొమ్మంటోంది! ఇంక రెక్కలు తెగిన పక్షినై మృత్యువు కోసం క్షణాలు లెక్కపెట్టటం తప్ప నేను చెయ్యగలిగేది ఏముందని?

మనిద్దరి మధ్య వున్నది కేవలం బంధుత్వమేనని



నువ్వు నా బావవని, నిన్ను పెళ్లి చేసుకునే అర్హత నాకుందని మాత్రమే నేను నిన్ను కోరుకోలేదు! అది నీకూ తెలును! ఊహ వచ్చింది మొదలు నీతోనే నా జీవితం అల్లుకుపోయింది! నాకు విజ్ఞానాన్నిచ్చావు. ఆత్మ విశ్వాసాన్నీ ధైర్యాన్నీ నూరిపోశావు! నాకంటూ ఒక వ్యక్తిత్వాన్ని కలిగించావు! మనిద్దరం కలిసి ముందు ముందు అనుభవించబోయే జీవితాన్ని నా కళ్లముందు అందంగా చిత్రించావు! నేను నేను కాదు కేశవా, నువ్వు చెక్కిన శిల్పాన్ని! యు ఆర్ మై పిగ్మాలియన్!

కేశవా, ఏదేదో రాస్తూ అసలు సంగతి రాయదేమిటని విసుక్కోకు! ఆ విషయాలన్నీ అత్తయ్య యీపాటికే నీకు వ్రాసి వుంటుందని నా నమ్మకం! నాన్నకూడా అత్తయ్యకి వ్యతిరేకంగా ప్రవర్తించే ఉద్దేశ్యంలోలేరు! అందుకే ఆఖరి సారిగా నిన్ను ఒక్కసారి "కేశవా" అని మనసారా పిలుచుకోవాలనే కోరిక బిగబట్టుకోలేక, నా మనసు నీముందు దాచలేక యివన్నీ రాశాను!

ఫేర్‌వెల్, మై ఫ్రెండ్!<br>
ఫేర్‌వెల్ ఫరెవర్!<br>
—జ్యోతి!

* * *

"అమ్మా..."

వంటిట్లో పనిచేసుకుంటున్న కాంతమ్మ కొడుకు పిలుపువిని, ఆదరా బాదరాగా వచ్చి తలుపు తీసి కొడుకుని చూస్తూనే నిర్ఘాంతపోయింది!

కొన్ని రాత్రులుగా నిద్రలేనివాడిలా, దేనికోసమో కృంగి కృశించిపోతున్న వాడిలా వడిలిపోయి వున్నాడు కేశవ!

నిర్ఘాంతపోయి చూస్తున్న తల్లినిచూసి నీరసంగా నవ్వుతూ, "అలా చూస్తూన్నావేమిటమ్మా?" అన్నాడు. "ఏంలేదులే, రా లోపలికి!" అంటూ లోపలికి నడిచింది కాంతమ్మ. మనసులో మాత్రం "వీడు జ్యోతిని పెళ్లి చేసుకోవద్దని వుత్తరం వ్రాశాననీ యిలా తయారయి వుంటాడు! కుర్రకారు, వీళ్లకేం తెలును, జీవితం గురించి! ప్రేమా దోమా వెనక్కి పెడితే లక్ష రూపాయల కట్నంతో రంభలాంటి కూతుర్ని యివ్వటానికి తన ఆడబడుచు సిద్ధంగావుంది! రత్నాన్ని వదిలేసి గుడ్డి గవ్వకోసం వరుగులు పెడతారా. ఎవరైనా?! వాణ్ణి నాలుగూ కడిగేసి అయినాసరే, యీ సంబంధానికి ఒప్పిస్తాను!" అనుకుంది.

ఆ ప్రకారమే కొడుకుతో ఏం మాట్లాడాలో మనసులో గట్టిగా అనుకుంటూ, కాఫీ గ్లాసు కొడుక్కి అందిస్తూ 'ఉత్తరం పత్తరం లేకుండా యింత హఠాత్తుగా వచ్చావేమిట్రా?" అంది ఉపోద్ఘాతంగా.

"నువ్వే కదమ్మా, రమ్మని రాశావు?!" అన్నాడు కేశవ మామూలుగా.

ఆశించని ఆ సమాధానానికి తెల్లబోయింది కాంతమ్మ. ఆడబడుచు కూతుర్ని యిస్తానంటోందని, ఏలు మానుకుని వస్తే పిల్లని చూసుకోవచ్చని తను రాసిన మాట నిజమే! కాని ఒక్క ముక్క కూడా ఎదురు చెప్పకుండా వీడిలా వచ్చేస్తాడని, అనుకోలేదు!

తల్లి ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే అన్నాడు కేశవ. నెమ్మదిగా! "కేవలం ఆ పని మీదే రాలేదమ్మా నేను! వేరే కారణం కూడా వుంది! నా ఉద్యోగం పోయింది!"

ఈసారి కాంతమ్మ మరింత తెల్లబోయి, వెంటనే తేరుకుంటూ, "నేను నమ్మను! జ్యోతిని పెళ్లాడ వద్దన్నానని నువ్వాడుతున్న నాటకం, యిదంతా!" అంటూ అరిచింది.

కేశవ కోపం తెచ్చుకోలేదు! శాంతంగా, 'నీ ఇష్టమమ్మా నువ్వేలా అయినా అనుకో! నేనసలే చాలా విసిగిపోయివున్నాను! అనుకోని చిక్కుల్లో చిక్కుకుని కొన్ని రాత్రులుగా కంటి మీద కునుకనేది లేదు, ఇప్పుడు నీకు నచ్చజెప్పే ఓపికా, సహనం నాలోలేవు! జ్యోతి విషయం మర్చిపో! నాకు అర్జెంట్‌గా ఏభై వేలు కావాలి! అందుకే వచ్చాను" అన్నాడు.

కొడుకు మాటల్లో వినిపిస్తున్న ఆందోళనా, నిజాయితీ కాంతమ్మకు నోట మాట రాకుండా చేశాయి! "ఏభై వేలా, యిప్పటికిప్పుడు అంత డబ్బు ఎలా వస్తుందిరా?! అయినా అంత డబ్బు ఒక్కసారి ఎందుకు నీకు?" అంది. "ఆ ఏభై వేలతో పోయిన నా ఉద్యోగాన్ని తిరిగి సంపాదించుకోవాలమ్మా! సుధని పెళ్లి చేసుకుంటే లక్షరూపాయలు యిస్తారని రాశావు! ముందుగా యిప్పుడు ఏభై వేలు యిమ్మను! ఆ డబ్బుతో నా ఉద్యోగం తిరిగి దక్కిందా, మరింక నయాపైసా తీసుకోకుండా సుధని చేసుకుంటాను! ఉద్యోగం దక్కలేదూ, ఆ మిగిలిన ఏభై వేలూ యిస్తే ఏదైనా చిన్న వ్యాపారం చేసుకుంటాను!"

కాంతమ్మకి యీసారి ఏడుపు వచ్చేసింది! ఏడుస్తూ, "ఒరేయ్, ఎందుకురా నన్నిలా ఏడిపిస్తావు? నువ్వు చెబుతున్న వన్నీ అబద్ధాలని చెప్పరా!" అంది.

కేశవ చేతులు జోడించి తల్లికి నమస్కారం చేస్తూ, "అమ్మా మనసులో నేనెంత ఏడుస్తున్నానో నీకు తెలియటం లేదు! నీకు అంత నమ్మకం లేకపోతే కాగితాలు చూపిస్తాను, ఎవరి చేతనైనా చదివించుకో! కాని, నీ కొడుకు బతుకు వీధిన పడేసిన దానివి అవుతావు!" అన్నాడు.

> **లాభంపొందే పుస్తకం**
>
> సుప్రసిద్ధ ఆంగ్లరచయిత బెర్నార్డ్‌షా చమత్కారి కూడా! ఒకసారి ఓ విలేకరి ఆయన్ని ఇంటర్వ్యూ చేస్తూ 'మీరు ఏ పుస్తకం వల్ల ఎక్కువ లాభాన్ని పొందారు?' అని అడిగాడు.
>
> 'నా చెక్‌బుక్ వల్ల' - అన్నాడు షా.
>
> —వి.సుచిత్రామాళి

కాంతమ్మ మాట్లాడలేదు! మౌనంగా ఏడుస్తూ వుండిపోయింది. కొద్దిసేపు చూసిన కేశవ, "మాట్లాడవేమిటమ్మా? అత్తయ్య దగ్గరికి నన్ను వెళ్లి మాట్లాడమంటావా?" అన్నాడు.

కాంతమ్మ మాట్లాడలేదు! స్వంత అన్న బ్రతికి వున్నప్పుడే ఆ కుటుంబం ఎలా వుందో పట్టించుకోని ఆడబడుచు, ఈనాడు తన కొడుకు ఇంజనీర్ అయాడని పిల్లనిస్తానన్న ఆడబడుచు ఉద్యోగం పోయిన మేనల్లుడికి లక్ష రూపాయల్నీ కూతుర్నీ యిస్తుందా?! "ఏమ్మా, అత్తయ్య యీ పరిస్థితిలో నాకు డబ్బిస్తుందని నీకు నమ్మకం లేదా?"

కాంతమ్మ కొడుకు ప్రశ్నకి జవాబివ్వకుండా, "పోనీ, మామయ్యని అడిగి చూడకూడదట్రా..." అందిసనుగుతూ.

తల్లి మాటలకి కేశవ ముఖం ఎర్రబడింది. "మామయ్యనా?! ఏ ముఖం పెట్టుకుని వెళ్లి అడగమంటావమ్మా!? తన కూతుర్ని చేసుకుంటామని మొదటి నించీ నమ్మించి యిప్పుడు కాదు పొమ్మన్నాం! మళ్లీ ఆ గుమ్మం ఎక్కి దేహీ అనటం కంటే యింత విషం తాగటం మంచిది!" అన్నాడు.

కాంతమ్మ చప్పున కళ్లు తుడుచుకుంటూ, "లేదురా! మామయ్యని అడగటానికి మనం భయపడక్కర్లేదు! వాడు మనని చిన్నబుచ్చడు! అవసరం యిదని చెబితే ఎలాగోలా ఆదుకుంటాడు" అంది.

కేశవ నవ్వి, "ఎలా ఆదుకుంటాడమ్మా?! తన కున్నదంతా మనకే పెట్టాడు! నన్ను కన్నది మీరే అయినా పెంచింది మాత్రం మామయ్యే! రూపాయి రూపాయి చొప్పున కొన్ని వేల రూపాయలు మన కోసం ఖర్చు పెట్టాడు. నాన్న చచ్చిపోయిన నాడు, నాన్న తరపు వాళ్లు ఒక్కరైనా వచ్చి, ఒక్క పైసా అయినా సాయం చేశారా? పందలూ వేలూ ఖర్చు పెట్టి మామయ్యే అంతా చేశాడు! నన్ను చదివించాడు! నాకోసం నలుగురి కాళ్లూ పట్టుకుని నాకు ఉద్యోగం వచ్చేలా చేశాడు! ఇంకా ఆయన దగ్గర ఏం మిగిలిందని? మిగిలివున్న అభిమానాన్ని కూడా మనం చంపేశాక, యింక మనకోసం ఏమైనా చెయ్యాలని ఎందుకనుకుంటాడు?" అన్నాడు.

కాంతమ్మకి కొడుకు మాటలతో మరింత దుఃఖం వచ్చింది. "నిజమేరా! ఏదో నీ సుఖం కోసం పాకులాడుతున్నాననుకుని నీకున్న ఒక్క ఆధారాన్నీ తెంపేశాను! అయినా పర్వాలేదురా. మామయ్య దేవుడి లాంటివాడు! నేను వెళ్లి క్షమాపణ చెప్పుకుని అడుగుతాను! జ్యోతిని నువ్వు చేసుకుంటావని కూడా చెబుతాను!" అంది.

"వద్దమ్మా! నాకిష్టం లేదు! మనం యింతటి అవకాశవాదులం కాకూడదు! రేపు నా అవసరం తీరాక, నీకు మళ్లీ సుధ గుర్తొస్తుంది! నీ ఆడబడుచు దగ్గర చుట్టమని అనిపిస్తుంది! ఎందుకొచ్చిన పాట్లమ్మా! యివి?! మామయ్యతో ఒకసారి చేసుకున్న తెగతెంపులు చాలు! మళ్లీ మళ్లీ మనం కృతఘ్నులం కావటం నాకిష్టం లేదు!"

"లేదురా! ఇంక యిటువంటి పని ఈ జన్మకి చెయ్యను! చట్టిలో వున్న గంజి పారబోసుకుని, పొరుగు వాళ్లిచ్చేబోయే పంచభక్ష్యాల కోసం ఎదురు చూడటం ఎంత అవివేకమో నాకు బాగా అర్థమైంది! ఇవేళే మామయ్య దగ్గరకి వెళ్తాను!"

"నువ్వు మనస్ఫూర్తిగా అంటున్నావా అమ్మా, ఆమాటలు!?" "ఆఁ దైవ సాక్షిగా...." కళ్లు తుడుచుకుంటూ అంది కాంతమ్మ.

"ఒక వేళ యిదంతా నే నాడిన నాటకమనీ, నేను చెప్పినవన్నీ అబద్ధాలనీ అన్నాననుకో....అప్పుడు?"

కాంతమ్మ చప్పున తలెత్తి కొడుకు వైపు చూసింది!

తర్వాత నవ్వి, "అప్పుడూ సంతోషిస్తాను! ఎందుకో తెలుసా? నువ్వు నిజంగా ఏ చిక్కుల్లోనూ లేనందుకు! మనకి ఎప్పుడూ ఒక్క ఆత్మీయుడైనా వుండాలనీ, అతణ్ణి ఎట్టి పరిస్థితుల్లోనూ దూరం చేసుకోరాదనీ నువ్వు నాకు తెలియజెప్పినందుకు!" అంది

"అయితే..."

కొడుకు మాటల్ని మధ్యలోనే అడ్డుకుంటూ, "అయితే యిదంతా నాటకం అంటావు! అంతేనా? అంది కాంతమ్మ.

"అవునమ్మా...నిన్ను ఎలా ఒప్పించాలో నీకు ఎలా నచ్చజెప్పాలో అర్థం కాక, యిలా చెయ్యాల్సి వచ్చింది!"

"పోనీలే! నువ్వు క్షేమంగా వున్నావు! అంతే చాలు! వెళ్లి స్నానం చేసి, మామయ్య దగ్గరకి వెళ్లి రా! నేను సాయంత్రం వస్తానన్నానని చెప్పు!" అంది కాంతమ్మ.

* * *

తలుపు చప్పుడవటంతో, ఏదో నవల చదువుకుంటున్న జ్యోతి, లేచి వెళ్లి తలుపుతీసింది! గుమ్మానికి అవతల నిలబడి వున్న కేశవని చూడగానే ఆమె కళ్లలో ఒక్క సారిగా కోటి నక్షత్రాలు వెలిగాయి! "ఎప్పుడొచ్చావు, కేశవా?! రా..." అంటూ దారి యిచ్చింది.

లోపలికి వచ్చిన కేశవ చుట్టూ చూస్తూ, గంభీరంగా, "మామయ్య లేడా?" అన్నాడు.

అతని ముఖంలో సీరియస్ నెస్ చూడగానే జ్యోతి ముఖంలో కళ తగ్గింది.

లేరు! ఎవరో తెల్సిన వాళ్లింట్లో పెళ్లి వుంటే అమ్మా నాన్నా వెళ్లారు.! ఈ పాటికి వచ్చేస్తూ వుంటారు! కూర్చో!" అంది.

"కూర్చోవటానికి రాలేదు, నేను. మామయ్యా వస్తే, తర్వాత మా యింటికి రమ్మని చెప్పు!" అంటూ వెళ్లటానికి సిద్ధమయ్యాడు కేశవ.

"మీ యింటికా?! ఎందుకు?"

"మిమ్మల్ని రమ్మని పిలవటం కోసం!" జ్యోతి ఆశ్చర్యం రెట్టింపు అయింది.

"మిమ్మల్ని రమ్మని పిలవటమా? ఎందుకు?" అంది.

కేశవ ఆమెవైపు చూస్తూ వెక్కిరింతగా, "కాళ్ళు కడిగించుకుని కన్యను దాన మందుకోవటం కోసం!" అన్నాడు.

ఆ మాట వినగానే జ్యోతి మనసు ఒక్కసారిగా కెరటంలా ఎగసిపడింది!

వెంటనే గంభీరంగా, "ఏ కన్యని!" అంది.

సమాధానం కూడా అంతే గంభీరంగా వచ్చింది. "తెలివితేటలూ, మూర్ఖత్వమూ కలపోసుకున్న కన్యని" -

జ్యోతి యింక ఆగలేకపోయింది. చప్పున కేశవ దగ్గరగా వస్తూ, "అలా ఉత్తరం రాశానని యింకా కోపమే?!" అంది.

"ఊ హూ! నాకు కోపమెందుకు? "నేను గుర్తున్నానా" అని నీ చేత అడిగించుకునే స్థితికి దిగ జారిపోయిన వాణ్ణి..."

"కేశవా..." చప్పున అతడి పెదవులకి చెయ్యి అడ్డం పెడుతూ అంది జ్యోతి. "నువ్వు నన్ను మర్చి పోయావనీ, మర్చిపోతావనీ కాదు! అత్తయ్య అన్నమాటలూ, నాన్న నిర్ణయమూ విన్నాక, నేను నీకు దూరమైపోయి నట్టే బాధపడ్డాను! ఆ ఉత్తరం రాసి పోస్ట్ చేసేవరకు, ఎంత నరకం అనుభవించానో తెలుసా?! ఆ ఉత్తరం పోస్ట్ చేశాక, అది చూసి నువ్వు తప్పకుండా వస్తావనీ అత్తయ్యని ఒప్పించగలవనీ కాస్త ఆశ కలిగింది! అయినా యింకా భయపడుతూనే వున్నాను! ఆ బాధలో ఆవేదనలో నీకు ఫేర్ వెల్ చెప్పేశాను గానీ, అదే నిజమైతే భరించగలనా?"

కేశవ మాట్లాడలేదు. జ్యోతి చెయ్యి పట్టుకుని దగ్గరకు లాక్కున్నాడు.

అతని స్వర్శలో జీవం పోసుకున్నట్టు నవ్వుతూ, "కోపం తగ్గిందా?" అంది జ్యోతి.

"నాది కోపం కాదు. బాధ! నేను అమ్మని ఒప్పించ లేక, పెళ్లి చేసుకోవాలనే కోరికకి లొంగిపోయి యింకెవర్నో చేసుకుంటానని నువ్వెలా అనుకోగలిగావో నాకిప్పటికీ అర్థం కాదు! నేను అంత చరిత్ర హీనుడిలా కన్పిస్తున్నా నన్న మాట..."


"అదిగో మళ్లీ...! నీ గురించే కాని నా బాధ అర్థం చేసుకోవేం..." చిరుకోపంగా అతనినుంచి దూరంగా జరగబోయింది జ్యోతి!

కాని కేశవ వదలలేదు! ఆమెని మరింత దగ్గరకి లాక్కుని, వల్చని ఆమె చెంపల్ని మృదువుగా పెదవు లతో స్పృశిస్తూ, "నన్ను పిగ్మాలలియన్ అన్నావు! పిగ్మాలియన్ తను చెక్కిన శిల్ప సౌందర్యాన్ని చూసి ఆ శిల్పాన్ని భార్యగా పొందటం కోసం ఎంతలా తపించి పోయాడోతెలియదా నీకు?" అన్నాడు.

జ్యోతి మాట్లాడలేదు! మౌనంగా తనని తాను అతనికి, అర్పించుకున్నట్టు, అదే అతని ప్రశ్నకి సమాధానమైనట్టు, అతనికి మరింత హత్తుకుపోయింది!

●

క్రీడారంగం



# టెన్నిస్‌రంగంలో ధ్రువతార మోనికా సెలెస్

అది జూన్ 9వ తేదీ. పారిస్‌లోని రోలాండ్ గారోస్ స్టేడియం.

అప్పుడే ఓ మహిళల ఫైనల్ పోటీ ముగిసింది.

టైటిల్‌ని కైవశం చేసుకున్నందుకు సూచనగా ఓ అందాల బాలిక తన రాకెట్‌ని గాలిలోకి విసిరి, ఆనందం పట్టలేక ముఖాన్ని చేతులతో కప్పుకుంది.

ఆనందభాష్పాలతో ముఖం తడిసిపోతోంది. విజయం తాలూకు పట్టరాని సంతోషం ఆమెని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఆమె పదహారేళ్ళ మోనికా సెలెస్.

**1990** ఫ్రెంచి ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో సాటిలేని మేటి, ప్రపంచపు నెం. 1 క్రీడాకారిణి అయిన స్టెఫీగ్రాఫ్‌ని వరుస సెట్లలో ఓడించి, తన జీవితంలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ని సాధించిన యుగోస్లేవియా యువ టెన్నిస్ తార.

గత మూడు నెలల కాలంలో ఆమెకిది వరుసగా ముప్పైరెండవ విజయం. కాగా స్టెఫీగ్రాఫ్‌పై రెండవ గెలుపు. గత ఇరవై రోజుల కాలంలో ఆమె మరెందరో అగ్రశ్రేణి క్రీడాకారిణులపై అనూహ్య విజయాలు సాధించింది.

రోమ్‌లో మే నెలలో జరిగిన 'ఇటాలియన్ ఓపెన్'లో మార్టినానవ్రాతిలోవాని వరుస సెట్లలో ఓడించి ప్రపంచ టెన్నిస్‌రంగంలో సంచలనం సృష్టించింది. సరిగ్గా వారం రోజుల తర్వాత పశ్చిమ జర్మనీలోని చెందిన వెస్ట్ బెర్లిన్ నగరంలో జరిగిన 'జర్మన్ ఓపెన్' లో ప్రపంచపు అత్యున్నత శ్రేణి క్రీడాకారిణిగా నేడు ప్రశంసలందుకుంటున్న జర్మనీ యువతార స్టెఫీగ్రాఫ్‌ని చిత్తుచేసి, టైటిల్ తోపాటు ప్రపంచ టెన్నిస్ క్రీడాభిమానుల ప్రశంస లందుకుంది. తిరిగి రెండువారాల వ్యవధిలోనే 'ఫ్రెంచి ఓపెన్' లో స్టెఫీగ్రాఫ్‌ని ఓడించి గ్రాండ్ స్లామ్ టైటిల్ సాధించి, ప్రపంచానికి తన సత్తా ఏమిటో చూపించి, ఇప్పటివరకూ తను సాధించిన విజయాలు కేవలం గాలివాటువి కావని ఋజువు చేసింది.

సంవత్సరం క్రితం 'వర్జీనియాస్లిమ్స్' పోటీతో అంతర్జాతీయ టెన్నిస్ రంగ ప్రవేశం చేసిన సెలెస్, ఆ పోటీ ఫైనల్‌లో మరో అగ్రశ్రేణి క్రీడాకారిణి 'క్రిస్ఎవర్ట్'ని ఓడించి, తొలిసారిగా టెన్నిస్ క్రీడాభిమానులకు తనను పరిచయం చేసుకుంది. అప్పటినుండి నేటివరకు ఆమె ఆరు ప్రముఖ అంతర్జాతీయ టైటిల్స్ సాధించింది. 'మోనికాసెలెస్' కేవలం సంవత్సరకాలంలో సాధించిన ఈ విజయాలను 'అద్భుతాలు'గా క్రీడాపండితులు వర్ణించారు.

ఆమెపై వ్యాఖ్యానిస్తూ స్టెఫీగ్రాఫ్, "ఆమెకిది కేవలం ఆరంభం మాత్రమే. ముందుముందు మరెన్నో అద్భుతాలు సృష్టించడానికి ఆమె సిద్ధంగా వుంది' అని వ్యాఖ్యానించిందంటే ఇక సెలెస్ ప్రతిభ ఊహించుకోవలసిందే.

రెండు చేతులతో రాకెట్‌ను పట్టుకుని, శక్తినంతా ఉపయోగించి బలమైన షాట్లు కొట్టడం ఆమె ప్రత్యేకత.

గత ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లలోనే దాదాపు ఫైనల్స్‌కి చేరువ కాగలిగినా దురదృష్ట వశాత్తూ టైటిల్స్‌ని సాధించలేకపోయింది.

మోనికాసెలెస్ తండ్రి వృత్తిరీత్యా ఓ కార్టూనిస్ట్ మరియు డిజైనర్. టెన్నిస్ పట్ల మోనికా కున్న ఉత్సాహాన్ని గమనించి తండ్రి కరోల్ సెలెస్ ఆమెకి పన్నెండేళ్ళ వయసప్పుడు యుగోస్లావియానుండి అమెరికాకు నివాసాన్ని మార్చాడు. అక్కడైతే ఆమెకి ఉన్నత ప్రమాణాలు గల శిక్షణనిప్పించవచ్చని ఆయన ఊహించాడు. ఆయన కలలను నిజం చేస్తూ మోనికా అచిర కాలంలోనే అగ్రశ్రేణి క్రీడాకారిణైంది.

ఇంత సాధించినా ఆమెలో పసితనపు ఛాయలింకా పోలేదు. తనకత్యంత ప్రియమైన దేదని ప్రశ్నించినప్పుడు 'వాల్ట్‌డిస్నీ సృష్టించిన మాయాప్రపంచం - డిస్నీలాండ్' అని తడుముకో కుండా సమాధానం చెబుతుంది మోనికా.

— సి. భాగ్యలక్ష్మి